క్లుప్తంగా

వైభవంగా బ్రహ్మోత్సవాలు



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని శ్రీకృష్ణధర్మరాజ స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా 18వ రోజు శనివారం ఉదయం చప్పరోత్సవం, రాత్రి దుర్యోధన, దుశ్శాసన వధ కార్యక్రమాలను నిర్వహించారు. తొలుత శాస్త్రోక్తంగా స్వామి వార్లకు పూజలు జరిపారు. ఉభయకర్తలుగా నలగర్ల వీరరాఘవయ్య– శ్రీలక్ష్మి, కొత్తూరు మురళీమోహన్– పుష్పలత దంపతులు వ్యవహరించారు. ఈఓ జానకి పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి 7 గంటలకు అగ్నిగుండ ప్రవేశం ఉంటుందని ఈఓ తెలిపారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నెల్లూరు(బృందావనం): నగరంలోని బాప్టిస్ట్ చర్చి డౌనీహాల్లో 'షో యువర్ లవ్ అగాపే' ఆధ్వర్యంలో నగర శివారులోని సింహపురి చైల్డ్ హోమ్ వారికి నెలవారీ నిత్యావసర సామగ్రిని శనివారం అందజేశారు. ఆశ్రమంలో జరిగిన కార్యక్రమంలో షో యువర్ లౌ అగాపే సభ్యులు ఎం.కృపారాజన్, ఆర్డీ జయకుమార్, వై.అంకయ్య, పెంచలయ్య, మేరీ సరళ, జ్యోతి జయకుమార్, మేరి బ్లెస్సింగ్టన్, ప్రభావతి, షీలా తదితరులు పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణ మంచిది కాదు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): జిల్లాలోని ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో ఎలాగైనా భూ సేకరణ చేపట్టాలని మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించడం మంచి పద్ధతి కాదని రైతు నాయకుడు మిరియం శ్రీనివాసులు అన్నారు. కరేడు గ్రామంలో బలవంతపు భూసేకరణ ఆపాలని నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ప్రజా సంఘాలు, రైతు సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ, కరేడు గ్రామంలో ఇండోసోల్ సోలార్ కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం 8,400 ఎకరాల భూసేకరణ చేస్తున్నట్టు జీఓ విడుదల చేసిందన్నారు. దీనిని మార్పు చేస్తూ గత నెల 21న ఐదు వేల ఎకరాల భూసేకరణ చేయాలని మరో జీఓ విడుదల చేశారన్నారు. ఇటీవల మంత్రి లోకేశ్ నెల్లూరు పర్యటనకు వచ్చిన సందర్భంలో రెవెన్యూ, పోలీసు, రాజకీయ నాయకులను సమావేశ పరిచి ఎలాగైనా కరేడులో భూసేకరణ చేపట్టాలని ఆదేశాలు ఇచ్చారన్నారు. దీంతో ఎమ్మెల్యేలు రైతులను పిలిపించుకుని భూసేకరణకు అనుకూలంగా ప్రకటన ఇవ్వాలని ఒత్తిడి చేసినా రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. రౌండ్ టేబుల్ సమావేశంలో భూసేకరణ ఆపాలని, అందుకు అనుకూలంగా ప్రభుత్వం జీఓ విడుదల చేయాలని తీర్మానం చేశామన్నారు. దీనిపై రైతులు, ప్రజా సంఘాల నాయకులతో కలిసి సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేయనున్నామన్నారు. సమావేశంలో పులిగండ్ల శ్రీనివాసులు, మంగా పుల్లయ్య, సాగర్, దామా అంకయ్య, శంకర్‌కిశోర్, రాంబాబు, మూలం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు చేయకపోవడం దారుణం



నెల్లూరు(బృందావనం): మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని ఎమ్మెల్సీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి శనివారం కలిశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. ప్రసన్న ఇంటిపై దాడి జరిగి ఐదు రోజులవుతోందని, ఈ విషయమై పోలీసులు తాము ఫిర్యాదు చేసినా ఎలాంటి కేసు నమోదు చేయలేదని ఆరోపించారు. ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ పాలనను అమలు చేస్తూ.. తమ పార్టీ నేతలపై అక్రమ కేసులు బనాయించడం, వారిపై దాడులకు తెగబడి ఆస్తుల విధ్వంసానికి పాల్పడుతూ పైశాచికానందాన్ని పొందుతోందని ఆరోపించారు. టీడీపీకి ఓ న్యాయం.. తమ పార్టీకి మరో న్యాయాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు.

కబ్జా కోరల్లో చెరువు

- ఏటా పెరుగుతున్న ఆక్రమణలు
- ఫిర్యాదు చేసినా, పట్టించుకోని అధికారులు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న ఆయకట్టు రైతులు
- కుంకుమపూడిలో ఇదీ తంతు



ఆక్రమణలతో కుచించుకుపోయిన కుంకుమపూడి చెరువు

వెంకటాచలం: ఆక్రమణదారుల స్వార్థం.. రైతులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకపోవడం వెరసి మండలంలోని చెముడుగుంట పంచాయతీ పరిధిలో గల కుంకుమపూడి చెరువు కబ్జా కోరల్లో చిక్కుకుపోతోంది. ఫలితంగా చెరువు ఆనవాళ్లు కోల్పోతుందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చెముడుగుంట పరిధిలో గల కుంకుమపూడి చెరువు విస్తీర్ణం సుమారు 60 ఎకరాలుంది. దీని కింద వందెకరాలకుపైగా వరిని ఏటా సాగు చేస్తున్నారు. అయితే కొన్నేళ్ల నుంచి కొందరు స్వార్థపరుల కన్ను చెరువు లోతట్టు భూమిపై పడింది. దీంతో ఏటా పోటాపోటీగా ఆక్రమణలకు పాల్పడుతున్నారు.

20 ఎకరాలకుపైగా ఆక్రమణలు

కుంకుమపూడి చెరువును కొన్నేళ్లుగా ఆక్రమణదారులు కొంచెం.. కొంచెం ఆక్రమిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం 20 నుంచి 25 ఎకరాలకుపైగా చెరువు భూమి ఆక్రమణకు గురైందని ఆయకట్టు రైతులు పేర్కొంటున్నారు. ఈ వ్యవహారమై కలెక్టర్, ఇరిగేషన్ అధికారులకు సైతం పలుమార్లు రైతులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఇరిగేషన్ అధికారులు ఇటీవల చెరువు వద్దకొచ్చి ఆక్రమణలకు పాల్పడితే చర్యలుంటాయని చెప్పి, ఫ్లెక్సీతో ఫొటోలు దిగి వెళ్లిపోయారు. అయితే ఆక్రమణదారుల నుంచి చెరువు భూమిని కాపాడే చర్యలు చేపట్టలేదు. దీంతో వీరు యథావిధిగా సాగు చేపట్టారు. మోటార్లను ఏర్పాటు చేసి చెరువు నీటిని అక్రమంగా తోడేస్తున్నారు. దీంతో ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వస్తోంది. చెరువు కుచించుకుపోవడంతో వేసవి కాలంలో గేదెలు, గొర్రెలు, మేకలు చెరువు వద్ద మేత మేసి, నీరు తాగే పరిస్థితి లేకుండాపోతోందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

కూటమి వైఫల్యాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలి



రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌ను చూపుతున్న పూజిత తదితరులు

పొదలకూరు: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లి.. హామీలను అమలు చేయని వైనంపై ప్రజలకు అవగాహన కల్పించే బాధ్యతను పార్టీ నేతలు, కార్యకర్తలు ముమ్మరంగా చేపట్టాలని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత పేర్కొన్నారు. రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టోపై సర్వేపల్లి నియోజకవర్గ నేతలు, కార్యకర్తలకు అవగాహన కార్యక్రమాన్ని నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అందజేసే క్యూఆర్ కోడ్‌లో చంద్రబాబు అమలు చేస్తానన్న హామీల వివరాలు ఉంటాయన్నారు. ఆయా గ్రామాల్లో నేతలు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి క్యూఆర్ కోడ్‌ను అందజేయాలని కోరారు. కార్యక్రమాలను తన తండ్రి గోవర్ధన్‌రెడ్డి ఎంత పకడ్బందీగా నిర్వహిస్తారో.. అదే స్థాయిలో పని చేయాలని విజ్ఞప్తి చేశారు. నేతలు చిల్లకూరు సుధీర్‌రెడ్డి, కోదండరామిరెడ్డి, గండవరపు సుగుణమ్మ, రావుల ఇంద్రసేన్‌గౌడ్, రావుల దశరథరామయ్యగౌడ్, లక్ష్మీకల్యాణి, దాసరి భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటా..

తోటపల్లిగూడూరు: సర్వేపల్లి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలకు అండగా ఉంటానని మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె కాకాణి పూజిత పేర్కొన్నారు. మండలంలోని కొత్తపాళేనికి చెందిన పార్టీ నేత కట్టా జ్వాలా సుందరరామిరెడ్డి ఇటీవల మరణించారు. ఈ క్రమంలో కొత్తపాళేనికి విచ్చేసిన ఆమె వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, వైస్ ఎంపీపీ చెరుకూరు శ్రీనివాసులునాయుడు, నేతలు ఇరుగు ఆదిశేషయ్య, అడపాల అవినాష్‌రెడ్డి, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు

- యువకుడికి గాయాలు



గాయపడిన యువకుడు



కాలువలో పడిన కారు

కోవూరు: కోవూరు పంచాయతీ పరిధిలోని గుమ్మళ్లదిబ్బ వద్ద ఓ కారు శనివారం కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న కోనమ్మతోటకు చెందిన రవికుమార్ అనే యువకుడికి గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108లో వైద్యశాలకు తరలించారు.

ప్రసన్నకు పెనుబల్లి గ్రామస్తుల పరామర్శ



ప్రసన్నను పరామర్శిస్తున్న మహిళలు

కోవూరు : నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై దాడిని ఖండిస్తూ బుచ్చిరెడ్డిపాళెం మండలం పెనుబల్లి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు ఆయన నివాసానికి శనివారం వెళ్లారు. ప్రసన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు. తాము ప్రసన్న వెంటే ఉంటామని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో తాళ్ల వెంకటేశ్వర్లు, గుమ్మా భాస్కర్, చంద్రశేఖర్, వెంకటేష్, దామర్ల మధు, ఏడుకొండలు, పానేటి శీనయ్య, గుది పెంచలయ్య, మద్దెల మోహన్ పాల్గొన్నారు.

విధ్వంసకాండ.. జిల్లాకు మాయని మచ్చ



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ప్రశాంత రాజకీయాలకు మారుపేరైన జిల్లాలో ఐదు రోజుల క్రితం జరిగిన విధ్వంసకాండ మాయని మచ్చగా మిగులుతుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగరాధ్యక్షుడు బొబ్బల శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి, ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన ప్రసన్నకుమార్‌రెడ్డికే రక్షణ లేకపోతే సామాన్యుల పరిస్థితేమిటని ప్రశ్నించారు. విమర్శలను తట్టుకోలేక ఇలాంటి దాడులు చేయడం సరికాదని హితవు పలికారు. జిల్లాలో హత్యా రాజకీయాలకు వీపీఆర్ దంపతులు తెరదీశారని ఆరోపించారు. మొదట వారు విమర్శలు చేశాకే ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రతి విమర్శలు చేసిన అంశాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. తప్పును ఇప్పటికీ తెలుసుకోకుండా, ధనబలంతో అందరితో మీడియా సమావేశాలను పెట్టిస్తున్నారని విమర్శించారు. ప్రశాంతిరెడ్డిని మాజీ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ గౌరవంగా సంబోధిస్తే, ఆయనపై ఏకవచనంతో మాట్లాడుతున్నారని, మీ సంస్కారం ఏమిటో దీని ద్వారానే తెలుస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక అసలు శాంతిభద్రతలున్నాయాననే అనుమానం కలుగుతోందని చెప్పారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాస్‌రావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వేమిరెడ్డి హంసకుమార్‌రెడ్డి, కేసరి శ్యామ్‌సింగ్, నవీన్‌రెడ్డి, ఆదిరెడ్డి, సుబ్బారెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం



కోవూరు: పాటూరు గ్రామంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా సేవలు అందించి బదిలీపై వెళ్తున్న చింత మౌనికను గ్రామంలోని తూర్పుపల్లిపాళెం రైతులు శనివారం ఘనంగా సన్మానించారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు అత్తిన వెంకోజీరావు ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గండవరపు సుబ్రహ్మణ్యం, కరకంబాకం వెంకటేశ్వర్లు, మేనాటి బాలకృష్ణ, గండవరపు వెంకట రమణయ్య, సుబ్బారావు, భాస్కర్‌రెడ్డి, పాకం ప్రసన్న, గండవరపు రవి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వెంకయ్యస్వామికి పూజలు



మనుబోలు: మండల పరిధిలోని బీసీ కాలనీ సమీపంలో గల భగవాన్ వెంకయ్యస్వామి మందిరంలో స్వామివారికి విశేష పూజలను శనివారం నిర్వహించారు. పంచామృతాభిషేకం, ప్రత్యేక పుష్పాలంకరణతో పూజలను అర్చకుడు శ్రీనివాసులు జరిపారు. ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. ఉభయకర్తలుగా గంధళ్ల కృష్ణయ్య అన్నపూర్ణమ్మ దంపతులు వ్యవహరించారు.

కక్షపూరిత రాజకీయాలు తగదు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా రాజకీయాలకు రాష్ట్రంలోనే పేరుండేదని, అటువంటి జిల్లాను ప్రస్తుతం కక్షపూరిత రాజకీయాలకు కేంద్రంగా మార్చారని, ఇది మంచి పద్ధతి కాదని వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.జయకుమార్‌రెడ్డి అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో వైఎస్సార్‌టీయూసీ నాయకులు శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం జిల్లాలో ప్రజల తరఫున మాట్లాడే ప్రతి వైఎస్సార్‌సీపీ నాయకుడిని టార్గెట్ చేస్తోందన్నారు. అందులో భాగంగా జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని అక్రమ కేసుల్లో ఇరికించి వేధిస్తున్నారన్నారు. అదేవిధంగా కోవూరు నియోజకవర్గంలో అవినీతి అక్రమాలు పెరిగిపోయాయని నిలదీసిన ప్రసన్నకుమార్‌రెడ్డిపై కక్షసాధింపు కోసం ఆయన ఇంటిపై దాడికి పాల్పడ్డారన్నారు. ఇలాంటి కక్షపూరిత రాజకీయాలపై వైఎస్సార్‌సీపీ నాయకులు పోరాటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాజేష్ మాట్లాడుతూ జూలై 7వ తేదీ రాత్రి ప్రసన్న ఇంటిపై దాడిని ప్రతిఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసుల ముందే దాడి జరిగిన తీరు చూస్తుంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఎలా ఉందో తెలుస్తోందన్నారు. ఇప్పటికైనా పోలీసులు వీపీఆర్ దంపతులపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని కోరుతున్నామన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



వంటగదిని పరిశీలిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పొదలకూరు: విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడంతో పాటు స్వచ్ఛమైన నీటిని తాగాలని కో లొకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి రిషితా కిరణ్ పేర్కొన్నారు. పట్టణంలోని వసతిగృహాల్లో వంటగది, స్టోర్ రూమ్‌లు, మరుగుదొడ్లను శనివారం పరిశీలించి సూచనలు చేశారు. స్టోర్‌రూమ్‌లో డబ్బాలపై మూతల్లేకపోవడాన్ని గమనించి వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు. కీటక జనిత, నీటి ద్వారా సంక్రమించే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆరోగ్యాధికారులు, సిబ్బంది కామాక్షమ్మ, వెంకటేశ్వర్లు, అరుణ, ఆశ వర్కర్లు రమణమ్మ, పెంచలనర్సమ్మ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.


యూరియా కొరత తీర్చండి



మాట్లాడుతున్న గురునాథం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జిల్లాలో వరిసాగుకు సంబంధించి యూరియా కొరత తీర్చాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యాల గురునాథం అన్నారు. మండలంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం రెండోపంటకు నీరిచ్చామని గొప్పలు చెప్పడం కాదని, యూరియా కొరత ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి యూరియా తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతన్నల తరఫున తాము రోడ్డు ఎక్కాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో చల్లాకొలుసు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిలో ఆపస్ జిల్లా సమావేశం



మాట్లాడుతున్న సత్యనారాయణ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని రాచూరు సోమయ్య కల్యాణ మండపంలో జిల్లా ఆపస్ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఏపీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ సత్యనారాయణ మాట్లాడుతూ విలువలు, సంస్కృతి ఆపస్‌కు రెండు కళ్లు అని తెలిపారు. భారతీయ సాంస్కృతిక చరిత్రను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ఆపస్ ముందుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రావణ్‌కుమార్, చక్రపాణి, బలరామకృష్ణ, అన్నపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మనుబోలులో దొంగల హల్‌చల్

- బైక్ చోరీ
- ఆలయంలో హుండీ అపహరణకు యత్నం



దొంగలు వదిలి వెళ్లిన బైక్

మనుబోలు: మనుబోలు మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. పడమటి వీధిలోని రామాలయం వద్ద హుండీని ఇద్దరు వ్యక్తులు పగలగొట్టేందుకు యత్నిస్తుండగా, స్థానికులు వెంబడించడంతో వారు తెచ్చుకున్న బైక్‌ను అక్కడే వదిలేసి పరారయ్యారు. బైక్‌ను పోలీస్‌స్టేషన్లో అప్పగించారు. స్థానిక దళితవాడలో మోచర్ల మల్లికార్జునకు చెందిన బైక్ తెల్లారేసరికి కనిపించకుండాపోవడంతో అది దొంగల పనై ఉంటుందని భావిస్తున్నారు. పడమటి వీధిలో దొంగలు వదిలివెళ్లిన బైక్ మోచర్ల మల్లికార్జునది కాకపోవడంతో ఇక్కడి నుంచి వెళ్లాక అతని వాహనాన్ని తస్కరించి ఉంటారని భావిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు



పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో గల శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో విశేష పూజలను శనివారం నిర్వహించారు. పల్లకిసేవను సాయంత్రం జరిపారు. అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కాగా శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని దేవస్థానంలో వెంకటేశ్వర కల్యాణాన్ని ఆదివారం సాయంత్రం 6.30కు నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు. మహిళా భక్తులకు ముత్యాల తలంబ్రాలను అందజేయనున్నామని పేర్కొన్నారు.

పూరి గుడిసెల దగ్ధం



అగ్నికి ఆహుతైన పూరి గుడిసె



కాలి బూడిదైన నోట్లు

విడవలూరు: అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో రెండు పూరి గుడిసెలు దగ్ధమైన ఘటన శనివారం మండలంలోని వరిణి గ్రామం ఎస్టీ కాలనీలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఈగ అక్కులయ్య పొలం పనికి వెళ్లి వచ్చి సాయంత్రం ఇంట్లో పడుకుని ఉన్న సమయంలో ఇంటి పైకప్పునకు నిప్పు అంటుకుని మంటలు ఎగసిపడ్డాయి. వెంటనే ఆయన బయటకు పరుగులు తీసి చుట్టుపక్కల వారిని పిలిచి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. నిమిషాల వ్యవధిలోని ఇంట్లోని బీరువాలో ఉన్న రూ.1.42 లక్షల నగదు, గృహోపకరణాలు పూర్తిగా దగ్ధమైంది. కాగా పక్కనే ఉన్న సిద్ధపరెడ్డి శీనమ్మ గుడిసెకు మంటలు వ్యాప్తి చెంది పూర్తిగా కాలిపోయింది. ఆమె ఇంటి పక్కనే నిలిపిన బైక్ కూడా అగ్నికి ఆహుతైంది. ప్రభుత్వం తమను ఆదుకుని సాయం చేయాలని బాధితులు కోరారు.